# చల్లచల్లగా.. తాటి ముంజలు

**వేసవి నేస్తం..పోషకాలు ఘనం ■ సేదదీరుతున్న నగరవాసులు**


మధురవాడ హైవేలో తాటిముంజల విక్రయాలు



**మధురవాడ:** కల్తీ లేనివి మందులు వాడనివి కేవలం తాటికాయలే.. వేసవి వచ్చిందంటే చాలు తాటి చెట్లకు కాయలు విరివిగా కనిపిస్తాయి. ప్రతి ఒక్కరూ తినాలనే తాపత్రయం పడుతుంటారు. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో మాత్రమే అందుబాటులో ఉండే తాటి ముంజలు ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో సైతం లభ్యమవుతున్నాయి. హైదరాబాద్ నడిబొడ్డులో కూడా వీటి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. జిల్లా కేంద్రాలతో పాటు మండల కేంద్రాల్లో సైతం తాటి ముంజలు విక్రయిస్తున్నారు. ఏ కాలమైనా పెద్దగా ఇబ్బందులుండవు కానీ, వేసవి కాలం వచ్చిందంటే వేసవి తాపానికి భయపడతాం. ఓవైపు భానుడు భగభగ.. మరోవైపు రోడ్లన్నీ నిప్పుల కుంపటిని తలపించేలా సుర్రుమంటాయి. ఇళ్లలో నీడపట్టున కూర్చున్నా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిపోతాం. కాలానికి తగ్గట్టు కమ్మని రుచులను వెంటబెట్టుకు వచ్చే తాటి ముంజలను తింటూ వేసవితాపం నుంచి ఉపశమనం పొందుతున్నారు. భీమిలి నియోజకవర్గంలోని ఆనందపురం–మధురవాడ జాతీయ రహదారి వెంట వీటిని ఎక్కువగా అమ్ముతున్నారు. భీమిలి, నెల్లిమర్ల ప్రాంతాల గీత కార్మికులకు ఇది మంచి ఉపాధినిస్తోంది. దీంతో, ఇప్పుడు వీటిని ప్రత్యేకమైన వేడుకల్లోనూ వినియోగిస్తున్నారు. స్వచ్ఛమైన, రుచికరమైన తాటి ముంజలు వేసవిలో తప్పక ఆస్వాదించాల్సిందే.

### దుష్ప్రభావాలు – తీసుకోవాల్సిన జాగ్రత్తలు

**అతిగా తినడం హానికరం:** తాటి ముంజలను మితంగా తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది. కానీ, వీటిని ఎక్కువగా తింటే జీర్ణ సంబంధిత సమస్యలు, కడుపు నొప్పి వంటివి వచ్చే అవకాశం ఉంది.

**గొంతు నొప్పి:** కొన్నిసార్లు, ముఖ్యంగా చల్లని ప్రదేశాల్లో నిల్వ ఉంచిన ముంజలను తీసుకోవడం వల్ల గొంతు నొప్పి, జలుబు వంటి సమస్యలు తలెత్తవచ్చు.

**పరిశుభ్రత ముఖ్యం:** పరిశుభ్రత పాటించని ప్రదేశాల్లో విక్రయించే ముంజలను తీసుకుంటే ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంది. కాబట్టి, శుభ్రమైన ప్రదేశాల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలి.

**తక్కువ రక్తపోటు ఉన్నవారు జాగ్రత్త:** తక్కువ రక్తపోటు (బీపీ) ఉన్నవారు వీటిని ఎక్కువగా తీసుకుంటే, రక్తపోటు మరింత తగ్గే అవకాశం ఉంది. కాబట్టి, వైద్యుల సలహా మేరకు తీసుకోవడం మంచిది.


గ్రామీణ ప్రాంతాలనుంచి తీసుకొచ్చిన తాటికాయలు

### చాలా ఇష్టం



వేసవి సెలవులు వచ్చాయంటే తాటి ముంజలు ఎక్కువగా తింటాం. చాలా రుచిగా ఉంటాయి. మండుటెండలో ఇవి తింటే ఎంతో హాయిగా ఉంటుంది. దాహం తీరుతుంది. వేసవిలో మామిడికాయలతో పాటు తాటి ముంజలు కోసం ఎదురుచూస్తుంటాం.
–యశస్విని, చిన్నారి, బోయిపాలెం.

### ఆరోగ్య ప్రయోజనాలు

**సహజమైన ఉపశమనం:** ఇవి ప్రకృతి ప్రసాదించిన స్వచ్ఛమైన ఆహారం. అధిక నీటి శాతం కలిగి ఉండటం వల్ల వేసవి వేడి నుంచి తక్షణ ఉపశమనం కలిగిస్తాయి. వడదెబ్బ తగలకుండా శరీరంలో చక్కెర, ఖనిజ లవణాల సమతుల్యతను కాపాడతాయి.

**శరీరానికి చల్లదనం:** శరీర ఉష్ణోగ్రతను తగ్గిస్తాయి. డీహైడ్రేషన్ బారిన పడకుండా చలువను అందిస్తాయి.

**పోషకాల గని:** తాటి ముంజల్లో విటమిన్ బీ–7, కేపీసీడీ, కరిగే ఫైబర్, పొటాషియం, కాల్షియం, జింక్, ఐరన్‌తో పాటు అనేక పోషకాలు ఉన్నాయి.

**గుండెకు ఆరోగ్యం:** పొటాషియం సమృద్ధిగా ఉండటం వల్ల రక్తపోటును అదుపులో ఉంచుతుంది. తద్వారా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. శరీరంలోని హానికరమైన వ్యర్థ పదార్థాలను తొలగించడంలో సహాయపడుతుంది.

**జీర్ణక్రియకు మేలు:** వీటిలోని పోషకాలు జీర్ణ సంబంధిత సమస్యలను తగ్గిస్తాయి. మృదువైన ఫైబర్ ఉండటం వల్ల ఆహారం సక్రమంగా జీర్ణమవుతుంది. గ్యాస్, ఎసిడిటీ, కడుపు ఉబ్బరం వంటి సమస్యలను తగ్గిస్తుంది.

**వికారం, వాంతులకు నివారణ:** వేసవిలో ఎండ కారణంగా వచ్చే వికారం, వాంతులను తగ్గిస్తాయి.

**మహిళలకు రక్షణ:** రొమ్ము క్యాన్సర్ కణాల పెరుగుదలను తగ్గించే గుణాలు కలిగి ఉన్నాయి.

**చికెన్ ఫాక్స్ నివారణ:** వేసవిలో వచ్చే చికెన్ ఫాక్స్‌ను నివారించి శరీరాన్ని చల్లగా ఉంచుతాయి.

**బరువు నియంత్రణ:** తక్కువ కేలరీలు కలిగి ఉండటం వల్ల బరువు తగ్గడానికి సహాయపడతాయి.

**చర్మానికి మెరుపు:** తాటి ముంజెలను గుజ్జుగా చేసి ముఖానికి పట్టిస్తే చర్మం ప్రకాశవంతంగా మారుతుంది. ఇది చర్మానికి కావలసినంత తేమను అందించి, వేసవిలో వచ్చే చెమటకాయలను నివారిస్తుంది. ఎండ వేడిమి వల్ల వచ్చే మచ్చలను తగ్గిస్తుంది.

**కాలేయానికి ఆరోగ్యం:** వీటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల కాలేయ సంబంధిత సమస్యలు తగ్గుతాయి. చెడు కొలెస్ట్రాల్ తగ్గి మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది.

**గర్భిణులకు మేలు:** గర్భిణులకు ఇది ఎంతో ప్రయోజనకరం. సహజ కాల్షియం, ఐరన్ మరియు ఇతర ఖనిజ లవణాలను అందిస్తుంది.


ఓ ఉన్నత స్థాయి ఫంక్షన్‌లో గ్లాసుల్లో సర్వ్ చేస్తున్న ఐస్ ఆపిల్

### శరీరానికి మేలు చేస్తుంది



దీని పేరులోనే ఐస్ ఆపిల్ ఉంది. ఇది శరీరానికి చలువ, అందించి, వేసవిలో ఉష్ణ తీవ్రతను తగ్గిస్తుంది. జల దోషం నివారిస్తుంది. శరీరంలో నీటి మోతాదు సమతుల్యం చేస్తుంది. చర్మ ఆరోగ్యానికి మేలు చేసి, చర్మ సౌందర్యాన్ని పెంచుతుంది. గర్భిణులకు మేలు చేస్తుంది. బీపీ ఉన్న వారు జాగ్రత్తలు తీసుకోవాలి, అతిగా తినడం మంచిది కాదు. పరిశుభ్రమైన ప్రదేశాల్లోనే తీసుకోవాలి.
–డాక్టర్. అరుణ్‌సాయి, సాధారణ వైద్య నిపుణుడు

### ఎంతో ఆరోగ్యం



నాకు తాటికాయలు అంటే చాలా ఇష్టం. కొమ్మాది జంక్షన్ నుంచి భీమిలి క్రాస్ రోడ్స్ వరకు వీటి కోసం వచ్చాను. సమయం దొరికినప్పుడల్లా వీటిని తింటా. వేసవి తాపం నుంచి కాపాడతాయి. తేలికగా జీర్ణమవుతాయి. వేసవిలో ఎంతో ఆరోగ్యం కూడా... –కె.దేవా, ఇంటీరియర్ డిజైనర్



## క్లుప్తంగా

### అమ్మవారి ఆలయం వద్ద అన్న సమారాధన


అన్న సంతర్పణలో పాల్గొన్న భక్తులు

**భీమునిపట్నం:** భీమిలి గ్రామదేవత శ్రీ నూకాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం భారీ అన్న సంతర్పణ నిర్వహించారు. గత నెల 27 నుంచి 30 వరకు అమ్మవారి వార్షిక ఉత్సవాలు వైభవంగా నిర్వహించిన విషయం తెలిసిందే. ఉత్సవాలు ముగిసి నెల రోజులు పూర్తయిన సందర్భంగా ఈ నెల పండుగను నిర్వహించారు. ఆదివారం ఉదయం ఆలయ ప్రధాన పూజారి చౌదరి సత్యరాజు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం జరిగిన అన్న సంతర్పణ కార్యక్రమంలో సుమారు ఐదు వేల మంది భక్తులు పాల్గొన్నారు.

### మహిళలకు చీరల పంపిణీ


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న లయన్స్ ప్రతినిధి పావని

**భీమునిపట్నం:** భీమిలిలోని సెంటినియల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా లయన్స్ గవర్నర్ ఎన్‌బీఎస్ఎస్ ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బీచ్‌లోని చిరు వ్యాపారులకు గొడుగులు, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అలాగే నెహ్రూ పాఠశాల విద్యార్థుల కోసం కథల పుస్తకాలు అందజేశారు. బీచ్ ఫొటోగ్రాఫర్లకు టీషర్ట్‌లు అనంతరం బీచ్ వద్ద ఏర్పాటు చేసిన సిమెంట్ సోఫాలను ప్రారంభించారు.కార్యక్రమంలో భీమిలి లయన్స్ క్లబ్ ప్రతినిధి కోట మల్లికార్జునరావు, క్లబ్ ప్రతినిధి పావని, సభ్యులు పాల్గొన్నారు.

### శాఖా గ్రంథాలయంలో నేటి నుంచి వేసవి శిక్షణ శిబిరం

**తగరపువలస:** స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి 40 రోజులు వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం కానుందని గ్రంథాలయ అధికారి బీవీఎస్ అప్పారావు తెలిపారు. రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వివిధ అంశాలపై శిక్షణ ఉంటుంది. ఉదయం 8 గంటలకు కథలు వినడంతో కార్యక్రమం ప్రారంభమవుతుంది. అనంతరం 8.30 నుంచి 10 గంటల వరకు పుస్తక పఠనం, 10.10 నుంచి 10.30 వరకు పుస్తక సమీక్ష ఉంటుంది. 10.30 నుంచి 11 గంటల వరకు విద్యార్థులు కథలు చెబుతారు. ఆ తర్వాత 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, డాన్స్, పప్పెట్ మేకింగ్, చెస్, క్యారమ్స్, క్విజ్ , జనరల్ నాలెడ్జ్‌లలో నిష్ణాతులైన వారిచే శిక్షణ ఇవ్వనున్నారు. మండలంలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అప్పారావు కోరారు.

### ఇస్కాన్‌లో మార్మోగిన హరినామస్మరణ


రాధాకృష్ణులు

**కొమ్మాది:** సాగర్‌నగర్‌లోని ఇస్కాన్ మందిరం ఆదివారం హరే కృష్ణ, హరే రామ నామ స్మరణతో మార్మోగింది. వారాంతపు ప్రత్యేక పూజల సందర్భంగా ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్ ప్రభుజీ , మాతాజీ నితాయి సేవిని భగవద్గీతలోని ముఖ్యమైన శ్లోకాలను వివరించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయస్వామి, నరసింహస్వామి విగ్రహాలను వివిధ రంగుల సుగంధ భరితమైన పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

### బీజేపీ 6,8 వార్డుల నూతన కార్యవర్గం

**పీఎం పాలెం:** జీవీఎంసీ 6, 8 వార్డులకు బీజేపీ నూతన కార్యవర్గం ఆదివారం స్థానిక కేకే హాలులో ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ ఎన్నికల్లో చోడవరం నాగరాజు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా సుబ్బరాజు, శేషలత, నాగరత్నం, ప్రధాన కార్యదర్శులుగా జీఆర్ఎస్ఎన్ రాజు, ఎల్లాజీ, కార్యదర్శులుగా సీతామహాలక్ష్మి, నవ్య, కోస్టు రఘు, గౌరి, సత్యసాయి, కోశాధికారిగా సత్యసాయి ఎన్నికయ్యారు. కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామ రాజు, ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకుడు కేఎస్పీ చక్రవర్తి హాజరయ్యారు.

## ఉన్నత విద్యతోనే భవిష్యత్తు


పురస్కారాలు అందుకున్న పిల్లలతో అతిథులు

**మధురవాడ:** ఉన్నత చదువుల ద్వారానే మంచి భవిష్యత్తు సాధ్యమవుతుందని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఉన్నతాధికారి వెంకటసుబ్బయ్య అన్నారు. ఆదివారం మధురవాడలోని ఓ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గ్రామీణ వైద్యుల కోసం వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు జరిగింది. అనంతరం వారి పిల్లలకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ, విద్యార్థులు భవిష్యత్తులో ఏమి సాధించాలనుకుంటున్నారో ముందుగానే నిర్ణయించుకుని, ఆ లక్ష్యానికి అనుగుణంగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 40 మంది ఆర్ఎంపీల పిల్లలకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. సదస్సులో భాగంగా డాక్టర్ అవినాష్ నరాల వ్యాధులు, వాటి చికిత్స, మహిళలకు వచ్చే వ్యాధులు..వాటి వైద్యం గురించి డాక్టర్ స్వాతి అవగాహన కల్పించారు. సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జ్యోషి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు ఎం.తిరుపతిరావు, విజయనగరం జిల్లా అధ్యక్షుడు జి. చిరంజీవి, విశాఖ జిల్లా అధ్యక్షుడు ఏ. శ్రీనివాసరావు, అనకాపల్లి కార్యదర్శి వీరభద్రరావు, జోనల్ కోశాధికారి కనకారావు తదితరులు పాల్గొన్నారు.

## మురుగుతో అవస్థలు


చంద్రంపాలెం వద్ద హైవే సర్వీసు రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

**మధురవాడ:** జీవీఎంసీ మధురవాడ జోన్–2లో పారిశుధ్య పరిస్థితి రోజురోజుకూ దిగజారిపోతోంది. తరచూ మురుగునీటి సమస్యలు తలెత్తుతున్నప్పటికీ ఉన్నతాధికారులు తగిన చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా జీవీఎంసీ పరిధిలోని 5, 6, 7 వార్డుల్లో మురుగునీరు ఎక్కడపడితే అక్కడ రోడ్లపై ప్రవహిస్తోంది. తాజాగా మధురవాడ చంద్రంపాలెం వద్ద మరోసారి మురుగునీరు ఏరులై పారింది. ఈ దుర్వాసన, మురికినీటితో స్థానికులు, వాహనదారులు, పాదచారులు, దుకాణదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. స్థానికులు ఫిర్యాదు చేయడంతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంతోష్ హుటాహుటిన స్పందించి తాత్కాలిక చర్యలు చేపట్టారు.

## అనంతుని శిఖర ప్రతిష్ఠ ఉత్సవాలకు సహకరించాలి


ఉత్సవాలపై చర్చిస్తున్న భక్త బృందం సభ్యులు

**పద్మనాభం:** పద్మనాభంలోని గిరిపై వచ్చే నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జరగనున్న అనంతుని శిఖర ప్రతిష్ఠ ఉత్సవాల విజయవంతానికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) నానాజీ బాబు విజ్ఞప్తి చేశారు. కుంతీ మాధవ స్వామి ఆలయంలో ఆదివారం అనంతుని శిఖర ప్రతిష్ఠ ఉత్సవాల ఏర్పాట్లపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో నానాజీ బాబు మాట్లాడుతూ, మే 5వ తేదీ సాయంత్రం కుంతీ మాధవ స్వామి ఆలయంలో కొలువై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలను, కలశాలను గ్రామంలో ఊరేగింపుగా తీసుకెళ్లి గిరిపై ప్రతిష్ఠిస్తామన్నారు.గిరిపై మే 6న వాస్తు హోమం, 7న విష్ణు ఆరాధన, క్షీరాధివాసం, 9న శిఖర ప్రతిష్ఠ, శాంతి కల్యాణం నిర్వహిస్తామని ఆయన తెలిపారు. సమావేశంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కోరెడ్డి దామోదరరావు, భక్త బృందం సభ్యులు తాలాడ పద్మనాభం, కోరాడ రమణ, కాళ్ల నగేష్ కుమార్, కంటుబోతు ఎర్నాయుడు, రామసింగు సన్యాసిరావు, బోని సన్యాసినాయుడు, సుంకర నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రదాడి అమానుషం


మధురవాడ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న పౌర సంక్షేమ సంఘం నాయకులు

**మధురవాడ:** పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి అత్యంత అమానుషమైన చర్య అని మధురవాడ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగోతి సూర్యప్రకాశరావు తీవ్రంగా ఖండించారు. ఆదివారం సాయంత్రం మధురవాడ శివశక్తినగర్ రోడ్డులో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశరావు మాట్లాడుతూ, ఇటువంటి దారుణమైన చర్యలను ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలన్నారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో పాల్గొన్న వారంతా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు జగన్మోహన్ చౌదరి, బెల్లాపు పాపారావు, యస్‌వీ రమణ, యామల శంకరరావు, బైపిల్లి సతీష్‌కుమార్, డాక్టర్ యస్. రమేష్, డాక్టర్ బీఎస్‌రావు, దువ్వి కావ్యారెడ్డి, పోలిశెట్టి నాగేశ్వరరావు, ఆశా స్వరూప్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**ఉగ్రదాడిలో మృతులకు నివాళులు**

**తగరపువలస:** జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాంలో ఈ నెల 22న జరిగిన ఉగ్రదాడిలో మృతులకు భీమిలి మండలం చిప్పాడ యువత ఆదివారం సాయంత్రం ఘనంగా నివాళులర్పించారు. దుర్గా చంద్రరావు ఇంటి వద్ద నుంచి జాతీయ జెండాలు, కొవ్వొత్తులతో యువకులు నమ్మివానిపాలెం, ఆశిపాలెం మీదుగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న యువకులు పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ఉగ్రవాదుల చిత్రపటాలను, పాకిస్తాన్ జెండాలను దహనం చేశారు. 'హిందూస్థాన్ జిందాబాద్' అంటూ వారు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మరోవైపు, ఆనందపురం మండలంలో పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో కూడా పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన వారికి సంతాపం తెలిపింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొని మృతులకు నివాళులర్పించారు.


చిప్పాడలో ర్యాలీ నిర్వహిస్తున్న యువత


ఆనందపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్లు

## అంధకారంలో హైవే


వేంకటేశ్వరమెట్ట నుంచి హైవే ఎడమవైపు వెలగని విద్యుద్దీపాలు


తగరపువలస సర్వీస్‌రోడ్లపై అలముకున్న అంధకారం

**తగరపువలస:** స్థానిక జాతీయ రహదారితోపాటు సర్వీస్ రోడ్లపై విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో అంధకారం అలుముకుంది. వేంకటేశ్వరమెట్ట నుంచి సంగివలస వరకు జాతీయ రహదారి ఎడమవైపున వీధి దీపాలు వెలగడం లేదు. అదేవిధంగా, సాంఘిక సంక్షేమ బాలుర కళాశాల వసతి గృహం నుంచి చిట్టివలస ఈఎస్ఐ కూడలి వరకు ఉన్న సర్వీస్ రోడ్లపై కూడా వీధి దీపాలు వెలగడం లేదు. ముఖ్యంగా చిట్టివలస ఈఎస్ఐ ఆసుపత్రి కూడలి వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు కూడా పనిచేయడం లేదు. సర్వీస్ రోడ్లపై ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండటంతో, ఈ చీకటిలో ప్రమాదాలు జరిగే అవకాశం అధికంగా ఉంది. విశాఖ నుంచి తగరపువలస కూడలి వైపు వచ్చే వాహనాలు ఈఎస్ఐ ఆసుపత్రి వద్ద అవతలి సర్వీస్ రోడ్డు నుండి ఇవతలి సర్వీస్ రోడ్డులోకి ప్రవేశిస్తుంటాయి. ఈ ప్రాంతంలో వెంటనే హైమాస్ట్ లైట్లను పునరుద్ధరించాలని వాహనదారులు కోరుతున్నారు. తరచూ జాతీయ రహదారి, సర్వీస్ రోడ్లపై చీకటి నెలకొనడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. సంగివలస, బాలాజీనగర్ ప్రాంతాలలో ఉన్న అండర్‌పాస్ రహదారులు కూడా చీకటిలో ఉండటంతో, ఆకతాయిలు అక్కడ తిష్టవేసి రాకపోకలు సాగించే వారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని, అండర్‌పాస్ ప్రాంతాలలో నిఘా ఉంచాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## వరుస దొంగతనాలతో బెంబేలు


ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడేసిన దొంగలు

**పద్మనాభం:** పాండ్రంగి పంచాయతీలోని సామయ్యవలస గ్రామంలో వరుసగా జరుగుతున్న దొంగతనాల వల్ల స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. గతంలో ఈ గ్రామంలో నాలుగు దొంగతనాలు జరిగాయి. నెల రోజుల క్రితం ఒక ఇంట్లో చోరీ జరిగి నగదు, బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. గ్రామంలోని చాలా మంది కూలీ పనుల కోసం ఉదయాన్నే వెళ్లి సాయంత్రం తిరిగి వస్తుండటంతో, వారి ఇళ్లలో ఎవరూ లేని సమయాన్ని దొంగలు గమనించి చోరీలకు పాల్పడుతున్నారు. ఈ నెల 18న రొంగలి సాధు ఇంట్లో పట్టపగలే దొంగతనం జరిగింది. ఉదయం 7 గంటల సమయంలో సాధు కుటుంబ సభ్యులు పొలంలోని మల్లెలు ఏరడానికి వెళ్లినప్పుడు, రామాలయం పక్కనే ఉన్న వారి ఇంట్లో చోరీ జరిగింది. తిరిగి వచ్చేసరికి చెక్క కబోర్డులో ఉంచిన ఎనిమిదిన్నర తులాల బంగారు ఆభరణాలు, రూ. 2.90 లక్షలు కనిపించలేదు. బాధితుడు సాధు ఈ ఘటనపై పద్మనాభం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో దొంగతనాలు పునరావృతం కాకుండా పోలీసులు నిఘా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల విజయోత్సవ ర్యాలీ


ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

**తగరపువలస:** ఇటీవల వెలువడిన పదో తరగతి పరీక్షా ఫలితాలలో ప్రతిభ కనబరిచిన చిట్టివలస జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఆదివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులు వీధుల్లో తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతను నినాదాల ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థి జె.వెంకట కీర్తన్ 587 మార్కులు సాధించగా, మరో 12 మంది విద్యార్థులు 550 కంటే ఎక్కువ మార్కులు పొందారు. అంతేకాకుండా 26 మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ విశాలమైన తరగతి గదులు, ఆటస్థలం , అత్యాధునిక సైన్స్ ల్యాబ్‌లు వంటి సౌకర్యాలు తమ పాఠశాలలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లోనే చేర్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.